సాక్షి అనంతపురం

శుక్రవారం । 26 । మే । 2023



టన్ను చీనీ రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.36 వేల ప్రకారం పలికాయి.



శభాష్ పోలీస్

జిల్లా పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి ఆరుగురి ప్రాణాలు కాపాడారు. జిల్లా కేంద్రంతో పాటు గుత్తిలో ఈ ఘటనలు జరిగాయి.

8లో

గరిష్టం/కనిష్టం
40.8°/24.4°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

గాలీవాన బీభత్సం



గాలీవానకు కూలిన వృక్షాలు, ఎగిరిపోయిన రేకులు

పెద్దవడుగూరు: మండల పరిధిలో గురువారం తెల్లవారు జామున గాలీవాన బీభత్సం సృష్టించింది. చింతలచెరువు గ్రామంలో భారీ వృక్షాలు నేలకు వాలాయి. దీంతో 6 గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. ఈదురు గాలుల దెబ్బకి శివశంకర్ అనే వ్యక్తి చెందిన ఆటోపై పెద్ద చెట్టు కూలడంతో వాహనం ధ్వంసమైంది. గ్రామంలోని ఎస్సీ కాలనీ మరో నలుగురికి చెందిన వరండా రేకుల షెడ్డులు గాలికి తీవ్రతకు ఎగిరిపోయాయి. పలు విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో కరెంటు సరఫరాకు అంతరాయం కలిగింది.

518 మంది విద్యార్థుల గైర్హాజరు



రాప్తాడు రూరల్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షలకు ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో 518 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోలని 77 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 11,527 మంది విద్యార్థులకు గాను 11,115 మంది హాజరయ్యారు. 412 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 2,174 మందికి గాను 2,065 మంది విద్యార్థులు హాజరయ్యారు. 106 మంది గైర్హాజరయ్యారు.

2న జిల్లాస్థాయి జాబ్‌మేళా



ఉరవకొండ: రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూన్ 2న ఉరవకొండ మహాత్మా డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి ఎల్.ఆనంద్‌రాజ్‌కుమార్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. జాబ్ మేళాకు 12 ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నాయని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకొని ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. ముందుగానే పేర్లను WWW. APSSDC. IN లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9010039901, 8096763970, 9989170313 నంబర్లను సంప్రదించాలన్నారు.

30 వేల క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్లు



అనంతపురం అగ్రికల్చర్: రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ 29వ తేదీ మొదలవుతున్న నేపథ్యంలో ఆర్‌బీకే వేదికగా రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.చంద్రానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతానికి 34 వేల మంది రైతులు 30 వేల క్వింటాళ్లకు పేర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. వేరుశనగతో పాటు కందులు, పెసలు, కొర్రలు, రాగులకు కూడా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. గుత్తి, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం, రాయదుర్గం, కుందుర్పి, బ్రహ్మసముద్రం, కణేకల్లు, శెట్టూరు, ఆత్మకూరు తదితర మండలాల్లో మంచి స్పందన ఉందన్నారు. కాగా గురువారం నాటికి 196 ఆర్‌బీకేల పరిధిలో 15,500 క్వింటాళ్ల విత్తన వేరుశనగ నిల్వ చేసినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జే.ధనలక్ష్మి తెలిపారు.

ఆ టీచర్లకు మ్యానువల్ కౌన్సెలింగ్

రాప్తాడురూరల్: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా కొందరికి మ్యానువల్ విధానంలోనే కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్, డబ్ల్యూ, ఎంటీఏ, మ్యూజిక్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ టీచర్లకు మ్యానువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించేలా విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఆయా టీచర్లకు మ్యానువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఈఓ సాయిరామ్ తెలిపారు. త్వరలోనే తేదీ, సమయం వెల్లడిస్తామని ప్రకటించారు.

స్పీడ్ తగ్గించు గురూ..

- ప్రమాదాల నివారణకు పోలీసు ప్రత్యేక యాప్
- అందుబాటులోకి తెస్తున్న అనంత పోలీసులు
- రోడ్లపై బ్లాక్‌స్పాట్స్ ఉంటే ముందే అలర్ట్
- వేగంగా వెళ్తుంటే స్పీడ్ తగ్గించుకోండని సూచన
- వాహనదారులందరికీ ఉచితంగానే సేవలు

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా జిల్లా పోలీసులు ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. తరచూ ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతానికి వంద మీటర్ల దూరంలోనే వాహనదారులను అప్రమత్తం చేసేలా చర్యలు చేపట్టారు. ఉచితంగానే అందించే ఈ సేవలతో రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టొచ్చని పోలీసులు చెబుతున్నారు.







సాక్షి ప్రతినిధి, అనంతపురం: అతివేగం .. నిద్రలేమి వెరసి గమ్యస్థానం చేరకముందే ప్రయాణాలు విషాదంగా మారుతున్నాయి. జిల్లాలో రోజు రోజుకూ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలు బాధిత కుటుంబ సభ్యులు గుండెలవిసేలా చేస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జాతీయ రహదారులు ఎక్కువగా ఉండటం వాహనాల సంఖ్య పెరగడం, డ్రైవర్లు కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన ఏటా వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

ముందే హెచ్చరిక...

ప్రధానంగా జాతీయ రహదారుల్లో బ్లాక్ స్పాట్స్ (ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతం) ప్రమాదాలకు ముఖ్య కారణం. ఆ తర్వాత మితిమీరిన వేగం ఈ రెండే ప్రధానమైనవి. అందుకే ఉమ్మడి జిల్లాలో ఎక్కడైతే బ్లాక్‌స్పాట్స్ ఉన్నాయో వాటిని యాప్‌లో చేరుస్తారు. బ్లాక్‌స్పాట్‌కు 100 మీటర్ల దూరంలో ఉండగానే మొబైల్ ఫోన్‌లో అలారం మోగుతుంది. మీ ముందు ప్రమాద హెచ్చరిక ఉంది జాగ్రత్త వెళ్లండి అంటూ వాయిస్ మెసేజ్ వస్తుంది. దీంతో వెంటనే డ్రైవర్ అలర్ట్ అయిపోతారు. బ్లాక్‌స్పాట్ దాటిన 100 మీటర్ల వరకూ ఈ మెసేజ్ వస్తూనే ఉంటుంది.

దిశ యాప్ తరహాలో ..

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అనంతపురం పోలీసులు ప్రత్యేకంగా ఈ యాప్‌ను రూపొందించారు. నాలుగు చక్రాల వాహనాలున్న ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తారు. ఉచితంగా ఈ యాప్‌ను ఇస్తారు. మండల స్థాయిల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తారు. త్వరలోనే ఈ యాప్ అందుబాటులోకి రానుంది.

ఏడాదిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు	దాదాపు 8500
ఏడాదిలో మృతుల సంఖ్య	దాదాపు 450
బ్లాక్‌స్పాట్స్ సంఖ్య	50కి పైనే..
ఉమ్మడి జిల్లాలో ఉన్న నాలుగు చక్రాల వాహనాలు	దాదాపు 90 వేలు
రెండు జిల్లాల్లోని ద్విచక్ర వాహనాలు	4.20 లక్షలు

వాయిస్ మెసేజ్‌లతో నిరంతరం అప్రమత్తం



వేగాన్ని నియంత్రించేందుకు మరో వాయిస్‌ను కూడా వాడారు. హైవేపై 80 లేదా అంతకు మించి వేగంతో వెళితే వెంటనే మొబైల్ ఫోన్‌లో మీ కుటుంబ సభ్యులు, బంధువులు మీకోసం ఎదురు చూస్తున్నారు. నెమ్మదిగా వెళితే మంచిదంటూ మెసేజ్ వస్తుంది. అధిక వేగంతో వెళ్తున్నంత సేపూ ఈ మెసేజ్ వస్తూనే ఉంటుంది. దీన్ని బట్టి డ్రైవర్లు జాగ్రత్తపడి వేగాన్ని నియంత్రించుకోవాల్సి ఉంటుంది. ఇవే కాకుండా జీబ్రా క్రాసింగ్‌లు, యూటర్న్‌లు, ప్రత్యేక మలుపులు వంటివి వచ్చినప్పుడల్లా ప్రత్యేక వాయిస్ మెసేజ్‌లు మనల్ని అప్రమత్తం చేస్తాయి.

ప్రమాదాల నివారణే ధ్యేయం



“రోడ్డు ప్రమాదాల వల్ల మృతుల , శాశ్వత వైకల్యం పొందిన వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రమాదాల నివారణే ధ్యేయంగా పోలీసు విభాగం తెస్తున్న యాప్‌ను వాహనదారులు వినియోగించుకోవాలి. ఈ యాప్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తాం. వాహనదారులందరికీ ఇది ఎంతో ఉపయోగం.

– ఆర్ఎన్.అమ్మిరెడ్డి, డీఐజీ

వాహనదారులు సహకరించాలి



రోడ్డు ప్రమాదాల నివారణకు త్వరలోనే యాప్ తెస్తున్నాం. యాప్ ద్వారా వాహనదారులకు ఎప్పటికప్పుడు మెసేజ్‌ల ద్వారా అలర్ట్ చేస్తాం. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వాహనదారులు సహకరించాలి. కలెక్టర్, ట్రాన్స్‌పోర్ట్ విభాగాలతో సమావేశం ఏర్పాటు చేయబోతున్నాం.

– కె.శ్రీనివాసరావు, ఎస్పీ

గ్యాస్ రీ ఫిల్లింగ్‌పై ఉక్కుపాదం

- 62 గ్యాస్ సిలిండర్లు సీజ్



నడిమివంక సమీపంలోని దుకాణంలో సిలిండర్లు సీజ్ చేస్తున్న డీఎస్ఓ శోభారాణి, అధికారులు

అనంతపురం అర్బన్: వంటగ్యాస్ రీ-ఫిల్లింగ్‌పై డీఎస్ఓ శోభారాణి ఉక్కుపాదం మోపారు. సిబ్బందితో కలసి గురువారం స్థానిక నడిమివంక సమీపంలోని గ్యాస్ స్టవ్ మరమ్మతు చేసే దుకాణంపై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ క్రమంలో గ్యాస్ రీ-ఫిల్లింగ్ కోసం అందుబాటులో ఉంచుకున్న 13 గృహావసర సిలిండర్లు (14 కిలోలు), 5 కిలోల సిలిండర్లు 20, నాలుగు కిలోల ప్రైవేటు కంపెనీ సిలిండర్లు 24 స్వాధీనం చేసుకున్నారు. అలాగే 6వ రోడ్డులో ఐదు గృహావసర సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్ఓ మాట్లాడుతూ నడిమివంక ప్రాంతంలోని ఎస్ఎమ్ గ్యాస్ స్టవ్ రిపేయిర్ దుకాణంలో అక్రమంగా గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తున్నారని తమకు పక్కా సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు. ఎక్కువ సంఖ్యలో గృహావసర సిలిండర్లు ఉంచుకుని వాటి నుంచి ఇతర సిలిండర్లకు రీ ఫిల్లింగ్ చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే సిలిండర్లను సీజ్ చేశామన్నారు. నిర్వాహకులపై 6-ఏ కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా గ్యాస్ రీ ఫిల్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, వాటిపై సీఎస్‌డీటీలకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీలు దుర్గాప్రసాద్, బి.ఎం.బాషా, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, వీఆర్ఓ అనుజాత పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు ఎంపిక

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ఆర్టీసీలో పనిచేస్తూ 2019 డిసెంబర్ 31 వరకూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి కారుణ్య నియామకాలకు ఎంపిక చేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని ఒక ప్రకటనలో తెలిపారు. 17 మందిని ఆర్టీసీ కానిస్టేబుళ్లుగా, 32 మంది అసిస్టెంట్ మెకానిక్, శ్రామిక్‌లుగా ప్రాథమికంగా ఎంపిక చేసినట్లు వివరించారు.

తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో సత్తా

తాడిపత్రి టౌన్: తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో తాడిపత్రికి చెందిన విద్యార్థులు సత్తాచాటారు. తాడిపత్రికి చెందిన పొన్నతోట ప్రమోద్‌కుమార్ స్టేట్ 5వ ర్యాంకు సాధించారు. అలాగే రేవంత్‌రెడ్డి అనే విద్యార్థికి 262వ ర్యాంకు వచ్చింది. దీంతో వారి తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే తాడిపత్రి పట్టణం జయనగర్‌కాలనీకి చెందిన విష్ణుకు 12,207వ ర్యాంకు, రంగ సర్వేష్ 14,406, లోకేశ్వరరెడ్డి 14,966 ర్యాంకులు సాధించినట్లు తల్లిదండ్రులు తెలిపారు.



ఫైజా సమ్రీన్, 60 వ ర్యాంకు



రేవంత్‌రెడ్డి, 262వ ర్యాంకు



భువనేశ్వర్‌రెడ్డి, 198వ ర్యాంకు

కంప్యూటర్ రీసెర్చ్ చేస్తా

తాడిపత్రిలోని సంజీవనగర్ మొదటి రోడ్డుకు చెందిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో స్టేట్ 262వ ర్యాంకు సొంతం చేసుకున్నారు. అలాగే జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 1847 ర్యాంకు సాధించారు. తాడిపత్రి పట్టణం శ్రీచైతన్య పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు చదివారు. 10వ తరగతి నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ (ఎంపీసీ) వరకు చదివారు. కంప్యూటర్ రీసెర్చ్ చేయాలన్నదే తన లక్ష్యమని రేవంత్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు . రేవంత్ రెడ్డి తల్లిదండ్రులు సుభద్రమ్మ, సంజీవరెడ్డి. తాడిపత్రి మండలం చిన్నపొలమడ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా సంజీవరెడ్డి పని చేస్తుండగా, తాడిపత్రి మున్సిపాలిటీ 7వ వార్డులోని ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా సుభద్రమ్మ పని చేస్తున్నారు.

వైద్యురాలిగా సేవలు అందించాలన్నదే లక్ష్యం

కదిరి అర్బన్/తనకల్లు: తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో కదిరికి చెందిన విద్యార్థులు జయభేరి మోగించి ఉత్తమ ర్యాంకులు సాధించారు. పట్టణానికి చెందిన ఫైజా సమ్రీన్ అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలో 60వ ర్యాంకు సాధించింది. ఈమె తండ్రి కదిరి మండలం కేఎస్ పాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్‌సైన్స్) గా పనిచేస్తున్నారు. తల్లి నస్రిన్ తలుపుల మండలంలోని ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఫైజా సమ్రీన్ విజయవాడలో శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ చదివింది. వైద్యురాలిగా సేవలు అందించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఫైజా సమ్రీన్ పేర్కొంది. కదిరికి చెందిన కొమ్మ భువనేశ్వర్‌రెడ్డి అగ్రికల్చర్ అండ్ మెడికల్‌లో 198వ ర్యాంక్ సాధించాడు.

నిబద్ధతతో పనిచేయండి

- సిబ్బందికి ఎస్పీ కంచి శ్రీనివాసరావు సూచన



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

కళ్యాణదుర్గం: 'పోలీసులు విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలలి.. పోలీసు శాఖకు చెడ్డపేరు తీసుకువచ్చేలా ఏ పనీ చేయకూడదు' అని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో గురువారం కళ్యాణదుర్గం పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక డీఎస్పీ బి.శ్రీనివాసులుతో కలిసి జిల్లా ఎస్పీ మాట్లాడారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకం కలిగేలా పనిచేయాలన్నారు. ముఖ్యంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండకూడదని చెప్పారు. హోంగార్డు స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు ఏ ఒక్కరూ కూడా అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించకూడదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ పోలీసులపై ఫిర్యాదులకు కంప్లైంట్ అథారిటీ ఏర్పాటు చేసిన విషయాన్ని జిల్లా ఎస్పీ గుర్తు చేశారు.

బాల్య వివాహాలతో జీవితాలు బుగ్గి

కుందుర్పి: బాల్యవివాహాలతో బాలికల జీవితాలు బుగ్గి పాలు చేసినవారవుతామని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని వడ్డెపాళ్యం గ్రామంలో ఐసీడీఎస్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బాలికల విద్య,బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలనపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్ణాటక సరిహద్దున ఉన్న మలయనూరు, జంబుగుంపల, పంచాయతీల్లో నిరక్ష్యరాస్యత కారణంగా బాల్యవివాహాలు చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలురతో సమానంగా బాలికలను ఉన్నత చదువులు చదివించి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు.

ఉన్నతంగా ఉండాల్సిందే

- విద్యార్థులకు ఉన్నత భవితే లక్ష్యంగా ఉన్నత విద్యామండలి చర్యలు
- నాణ్యతా ప్రమాణాలు పాటించని డిగ్రీ కళాశాలలపై కొరడా
- గతేడాది 8 , ఈ ఏడు మరో 7 కళాశాలల గుర్తింపు రద్దుకు ఆదేశాలు

అనంతపురం: నాణ్యతా ప్రమాణాలు అసలే ఉండవు. అర్హులైన అధ్యాపకులు వెతికినా కనబడరు. కానీ కళాశాల నిర్వహణ మాత్రం సాగిపోతూ ఉంటుంది. ధనార్జనే ధ్యేయంగా తూతూ మంత్రంగా చదువులు చెప్పి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న ఇలాంటి కళాశాలల ఆట కట్టించడమే ధ్యేయంగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం యాజమాన్యం కొరడా ఝుళిపించింది. 2022-23 విద్యా సంవత్సరంలో 8 డిగ్రీ కళాశాలల గుర్తింపు రద్దు చేసింది. తాజాగా మరో 7 డిగ్రీ కళాశాలలకు గుర్తింపు రద్దుకు వర్సిటీ యాజమాన్యం పాలక మండలి సిద్ధమైంది.

తగ్గనున్న కళాశాలల సంఖ్య

నిష్ణాతులైన అధ్యాపకులు ఉంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. మౌలిక వసతులు బాగుంటే అందరికీ మేలు జరుగుతుంది. ఈ దిశగా చర్యలకు ఉపక్రమించిన ఎస్కేయూ గత విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే 8 కళాశాలలపై వేటు వేసింది. 2022-23 విద్యా సంవత్సరంలో 8 కళాశాలలు అడ్మిషన్లు నిర్వహించలేదు. తాజాగా మరో 7 డిగ్రీ కళాశాలలపై చర్యలకు ఉపక్రమించడానికి పాలక మండలికి నివేదించారు. వర్సిటీ పరిధిలో మొత్తం 90 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. గతేడాది 8 డిగ్రీ కళాశాలలు రద్దు కావడంతో ఆ సంఖ్య 82కు చేరింది. తాజాగా మరో 7 కళాశాలలకు గుర్తింపు రద్దు చేస్తే 75 కళాశాలకు చేరనుంది.



ఎస్కేయూ పాలక భవనం

మూడు కేటగిరీలుగా విభజన

మౌలిక వసతులు, నాణ్యత ప్రమాణాలను బట్టి మూడు కేటగిరీలుగా విభజించి అత్యున్నత నాణ్యత ప్రమాణాలు ఉంటే తొలి కేటగిరీగా, ఒక మోస్తరులో ఉంటే రెండు, అధ్వాన్నంగా ఉంటే మూడో కేటగిరీగా విభజించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. జిల్లాలో తొలి కేటగిరీలో ఒక్క డిగ్రీ కళాశాల కూడా లేదని గతేడాది నిజనిర్ధారణ కమిటీ తేల్చింది. ఈ నేపథ్యంలో మూడో కేటగిరీలో ఉన్న 8 డిగ్రీ కళాశాలలు గుర్తింపు రద్దు చేశారు. అనంతపురంలో నాలుగు, కణేకల్లులో రెండు, కదిరిలో రెండు ఈ జాబితాలో ఉన్నాయి.

ప్రమాణాలు పాటించాల్సిందే..

వర్సిటీ నిర్దేశించిన ప్రమాణాల మేరకు కాలేజీల మదింపు జరుగుతోంది. 30 శాతం లోపు ఫ్యాకల్టీ ఉండకూడదు. నిర్దేశించిన స్థలంలో 30 శాతం లోపు ఉండకూడదు. రిజిస్ట్రేషన్ కాని భూమిలో కళాశాల ఉండకూడదు. అలాగే లీజు డాక్యుమెంట్లు, సొసైటీ పేరుతో టైటిల్ డీడ్ ఉంటే చెల్లదు. కమర్షియల్ కాంప్లెక్స్‌లో కళాశాల ఉండకూడదు. గత మూడు సంవత్సరాల్లో 25 శాతం లోపు అడ్మిషన్లకే పరిమితమై ఉండకూడదు.

విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం



నాణ్యమైన విద్య, మౌలిక వసతులు అందించే రీతిలో కళాశాలలు ఉండాలి. తద్వారా విద్యార్థి భవిష్యత్తుకు దోహదపడే బోధనాభ్యసన ప్రక్రియ ఉంటుంది. నిజనిర్ధారణ కమిటీ నివేదిక మేరకు ఎన్ని డిగ్రీ కళాశాలలకు అనుమతి వస్తుందనే అంశంపై పాలక మండలి తేలుస్తుంది. ప్రమాణాలు లేని కళాశాలలపై చర్యలు తప్పనిసరి.

– మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వీసీ, ఎస్కేయూ

గుడ్ ఈవినింగ్ డాక్టర్

- సాయంత్రం ఓపీ సేవలపై ప్రజల్లో సంతృప్తి



సాయంత్రం ఓపీ స్లిప్పులు తీసుకుంటున్న రోగులు



రక్తపరీక్షల నివేదికను ఇస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

అనంతపురం క్రైం: సుదూర ప్రాంతాల నుంచి వచ్చే గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈవినింగ్ ఓపీ సేవలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఉదయం చూపించుకున్న రోగులకు రక్త, ఎక్స్‌రే, తదితర పరీక్షల ఫలితాలు మధ్యాహ్నం వస్తుండటంతో సాయంత్రం వైద్యులకు చూపించుకు వెళ్తుండటంతో వ్యయ ప్రయాసలు తప్పుతున్నాయి.

ఖర్చులు తగ్గాయి

నేను మోకాళ్ల నొప్పితో బాధపడతున్నా. ఆస్పత్రిలోని ఓపీ నంబర్ 29 పెయిన్ రిలీఫ్ క్లీనిక్‌లో వైద్యులు సకాలంలో చూసి రక్త పరీక్షలు రాశారు. సాయంత్రానికి ఆ రిపోర్టులు వచ్చాయి. మా ఊరి నుంచి ఇక్కడకు రావాలంటే ఒక్కొక్కరికి రూ.160 ఖర్చు అవుతుంది. గతంలో ఒక రోజు వస్తే మరుసటి రోజు రావాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా ఒకేసారి అన్ని సేవలు అందిస్తున్నారు.

– బసమ్మ , గొల్లపల్లి, గుమ్మఘట్ట

సీనియార్టీ జాబితా సిద్ధం

రాప్తాడురూరల్: జోన్-4 పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల్లోని ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లలో ఖాళీగా ఉన్న గ్రేడ్-2 హెచ్ఎం పోస్టులకు పదోన్నతులు కల్పించేందుకు సీనియార్టీ జాబితాను సిద్ధం చేసినట్లు పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు ఎం.వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. అర్హులైన వారు జిల్లా విద్యాశాఖ అధికారి వెబ్‌సైట్‌లో జాబితాను ఉంచినట్లు వెల్లడించారు. ఈనెల 26న ఉదయం 10 గంటలకు కడప ఆర్జేడీ కార్యాలయానికి రావాలని సూచించారు.

క్లుప్తంగా

బాధ్యతగా పనిచేయాలి

- హోంగార్డులకు కమాండెంట్ మహేష్ కుమార్ సూచన



మాట్లాడుతున్న హోంగార్డుల కమాండెంట్ మహేష్‌కుమార్

కళ్యాణదుర్గం: విధుల్లో భాగంగా ఉన్నతాధికారులు అప్పగించిన పనిని బాధ్యతతో పూర్తి చేయాలని హోం గార్డులకు ఆ విభాగం దక్షిణ మండలి కమాండెంట్ ఎస్.మహేష్‌కుమార్ సూచించారు. తిరుపతి రీజియన్ హోంగార్డుల డీఎస్పీ లక్ష్మణ్‌మార్, స్థానిక డీఎస్పీ బి.శ్రీనివాసులుతో కలసి కళ్యాణదుర్గం పోలీసు సర్కిల్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆయన హోంగార్డులతో సమావేశమై మాట్లాడారు. హోంగార్డుల విధులపై అవగాహన కల్పించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విధులు నిర్వర్తించాలన్నారు. అంతకు ముందు హోంగార్డుల సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం పోలీసు డివిజన్ పరిధిలోని హోంగార్డులు పాల్గొన్నారు.

రైతుపై ఎలుగుబంటి దాడి



గాయపడిన రైతు చెన్నారెడ్డి

గార్లదిన్నె: పంటకు కాపలాగా ఉన్న రైతుపై ఎలుగుబంటి దాడి చేసింది. స్థానికులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన రైతు చెన్నారెడ్డి.. బుధవారం రాత్రి ఓటి కుంట చెరువు సమీపంలోని కల్లంలో మొక్కజొన్న పంటకు కాపలాకు వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున అటుగా వచ్చిన ఎలుగుబంటి.. చెన్నారెడ్డిపై దాడి చేసింది. రెండు కాళ్లను నోటితో కరిచి గాయపరిచింది. ఆ సమయంలో చేతిలో ఉన్న కర్రతో ఎదురుదాడికి దిగి గట్టిగా కేకలు వేస్తూ ఎలుగుబంటిని తరిమేశాడు. అనంతరం అతి కష్టంపై రోడ్డుపైకి చేరుకోవడంతో గమనించిన స్థానిక రైతులు వెంటనే ఆటోలో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. కాళ్లకు బలమైన గాయాలైనట్లు వైద్యులు తెలిపారు.

శభాష్ పోలీస్!

క్షణికావేశం వారితో తప్పటడుగులు వేయించింది. కుటుంబ కలహాల నేపథ్యంలో పిల్లలతో కలసి తనువు చాలించాలనుకున్నారు. దంపతుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలకు లోకజ్ఞానం తెలియని పిల్లలనూ బలిపశువులను చేయాలనుకున్నారు. సకాలంలో ఈ విషయాలను పసిగట్టిన పోలీసులు సమయ స్ఫూర్తితో వ్యవహరించి మొత్తం ఆరుగురి ప్రాణాలను కాపాడారు. జిల్లా కేంద్రంతో పాటు గుత్తిలో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఖాకీలు స్పందించిన తీరుకు జనం జేజేలు పలికారు. శభాష్ పోలీస్ అంటూ అభినందించారు.

- వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురి ప్రాణాలు కాపాడిన పోలీసులు
- కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నం
- భార్యతో గొడవ పడి కొడుకులతో కలసి రైలు కిందపడబోయిన భర్త
- భర్త తాగుడు భరించలేక కుమార్తెలతో కలసి చెరువులో దూకబోయిన భార్య
- సకాలంలో స్పందించిన పోలీసులు



అనంతపురంలో దంపతులను రాజీ చేసిన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: దంపతుల మధ్య చిన్నపాటి వివాదం చిలికిచిలికి గాలివానగా మారింది. దీంతో క్షణికావేశానికి లోనైన భర్త తన ఇద్దరు కుమారులను తీసుకుని రైలు కిందపడబోయాడు. ఈ ఘటన అనంతపురంలో గురువారం చోటు చేసుకుంది.

కుటుంబ కలహాలు తాళలేక

అనంతపురంలోని ఐదో రోడ్డుకు చెందిన గురజాల హరికృష్ణ, లీలావతి దంపతులు. వీరికి ప్రవీణ్, ప్రేమ్ కుమార్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించే హరికృష్ణ.. తాను జమ చేసుకున్న నాలుగు డబ్బులను పెట్టుబడిగా పెట్టి చిరు దుకాణాలకు చాక్లెట్లు, బిస్కట్లు సరఫరా చేసే వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో చిన్నపాటి విషయానికి సైతం ఇంట్లో దంపతుల మధ్య గొడవ చోటు చేసుకునేది. గురువారం ఉదయం దంపతులిద్దరూ మరోసారి గొడవపడ్డారు. క్షణికావేశానికి లోనైన హరికృష్ణ... తన ఇద్దరు కుమారులను తీసుకుని ఇల్లు విడిచి బయటకు వచ్చాడు.

'సెల్ఫీ'తో అప్రమత్తం

ఇల్లు విడిచి బయటకు వచ్చిన హరికృష్ణ.. జీవితంపై విరక్తితో తనువు చాలించాలనుకున్నాడు. అయితే తాను చనిపోతే పిల్లలిద్దరూ రోడ్ల పాలవుతారని భావించి, వారిని కూడా తనతో పాటు ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించి, విషయాన్ని వివరిస్తూ సెల్ఫీ ఫొటో తీసి బంధువులకు పోస్టు చేయడంతో వారు డయల్ 100కు చేరవేశారు. సమాచారం అందుకున్న అనంతపురం మూడో పట్టణ సీఐ కత్తి శ్రీనివాసులు నేతృత్వంలో కానిస్టేబుళ్లు బృందాలుగా విడిపోయి గంటకు పైగా నగరం చుట్టు పక్కల రైలు పట్టాల వెంబడి అన్వేషణ కొనసాగించారు. చివరకు నేషనల్ పార్క్ సమీపంలో పట్టాలపై రైలు రాక కోసం ఎదురు చూస్తున్న హరికృష్ణ, ఆయన ఇద్దరు కుమారులను గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు పిలుచుకెళ్లారు. అనంతరం లీలావతిని స్టేషన్‌కు పిలిపించి దంపతులిద్దరికీ కౌన్సెలింగ్ నిర్వహించి వారి మధ్య రాజీ చేశారు.

భర్త తాగుడు భరించలేక



గుత్తిలో కృష్ణవేణి, ఇద్దరు కుమార్తెలను కాపాడి భర్తకు అప్పగిస్తున్న పోలీసులు

గుత్తి: ఎంత బతిమలాడినా భర్త తాగుడు మానక పోవడంతో మనస్తాపం చెందిన ఓ వివాహిత తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని చెరువులో దూకబోయింది. ఈ ఘటన గుత్తిలో గురువారం చోటు చేసుకుంది.

ఆర్థిక ఇబ్బందులు తలెత్తి..: గుత్తి మండలం బేతాపల్లికి చెందిన సూర్యనారాయణ, కృష్ణవేణి దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. కొన్నేళ్ల క్రితమే బతుకు తెరువు కోసం గుత్తికి వలస వచ్చి బీసీ కాలనీలో నివాసముంటున్నారు. ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో సూర్యనారాయణ మద్యానికి బానిసయ్యాడు. సంపాదనలో అధిక శాతం తాగుడుకే ఖర్చు పెట్టసాగడంతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, వారికి మంచి చదువులు చెప్పించి, పెళ్లి చేయాల్సిన బాధ్యత తమపై ఉందని, తాగుడుకే డబ్బు తగలేస్తుంటే ఇల్లు గడిచేదెట్లా? పిల్లల చదువులు ఎలా కొనసాగించాలి? వారి పెళ్లిళ్లకు డబ్బు ఎలా జమ చేయాలి? అంటూ కృష్ణవేణి మదనపడుతూ వచ్చింది.

పోలీసుల చేతికి సెల్ఫీవీడియో : తాగుడు మానేసి ఇంటి బరువు బాధ్యతలు కాస్త చూడాలని తరచూ సూర్యనారాయణకు కృష్ణవేణి చెబుతూ వచ్చింది. తాగుడు మానేయకపోతే పిల్లలతో కలసి తాను చస్తానని గురువారం ఉదయం భర్తను హెచ్చరించింది. భర్తలో కనీస స్పందన లేకపోవడంతో ఆమె తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని ఇల్లు విడిచి వెళ్లిపోయింది. 'నీవు మారకపోతే పిల్లలతో కలసి ఆత్మహత్య చేసుకుంటా' అంటూ సెల్ఫీ వీడియో తీసి భర్త వాట్సాప్ నంబర్‌కు షేర్ చేసింది. వెంటనే గుత్తి సీఐ వెంకట్రామిరెడ్డిని సూర్యనారాయణ కలసి జరిగిన విషయాన్ని తెలిపి సెల్ఫీవీడియో చూపించాడు. సీఐ ఆదేశాల మేరకు పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి చెరువు కట్టపై జల్లెడ పట్టారు. చివరకు చెరువు కట్టపై ఆంజనేయస్వామి ఆలయం వద్ద కృష్ణవేణి, పిల్లలను గుర్తించి, స్టేషన్‌కు పిలుచుకెళ్లి, సూర్యనారాయణకు కౌన్సెలింగ్ ఇచ్చి, భార్యాపిల్లలను అప్పగించారు.

ఎస్పీ అభినందన : సకాలంలో స్పందించి ఆరుగురి ప్రాణాలు కాపాడిన జిల్లా పోలీసుల చర్యలపై ఎస్పీ కె.శ్రీనివాసరావు స్పందించారు. అనంతపురం త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ శివయ్య, కానిస్టేబుళ్లు ఆనంద్ రంజిత్, నరేష్‌తో పాటు గుత్తి సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, కానిస్టేబుళ్లను అభినందించారు.

'నానో' ఎరువులతో అధిక దిగుబడి

- 'ఆత్మ' పీడీ మద్దిలేటి



మాట్లాడుతున్న ఆత్మ పీడీ మద్దిలేటి

అనంతపురం అగ్రికల్చర్: 'ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్స్ కో ఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్‌కో)' అందుబాటులోకి తీసుకువచ్చిన నానో యూరియా, డీఏపీ ఎరువులు పంట ఉత్పాదక శక్తి, దిగుబడులు పెంచడంలో సమర్థవంతంగా పనిచేస్తాయని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పీడీ మద్దిలేటి తెలిపారు. స్థానిక ఓ ప్రైవేట్ అతిథి గృహంలో గురువారం ఇఫ్‌కో జిల్లా మేనేజర్ మణికళ్యాణ్ అధ్యక్షతన జరిగిన మార్కెటింగ్ సదస్సులో ఆయన మాట్లాడారు. ఇఫ్‌కో స్టేట్ మేనేజర్ టి.శ్రీధర్‌రెడ్డి, అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.వెంకటరాముడు, రూరల్ ఏఓ పి.వెంకటేశ్వర ప్రసాద్, మార్క్‌ఫెడ్ ప్రతినిధి గీతమ్మ, శాస్త్రవేత్త డాక్టర్ రవికిశోర్, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ప్రస్తుత మార్కెట్‌లో డిమాండ్‌కు తగినట్లు ఎరువులు, యూరియా సరఫరా లేకపోవడం, ధరలు కూడా 50 కిలోల బస్తాకు రూ.1,350 చొప్పున పెరగడంతో రైతులపై పెట్టుబడి భారం పెరుగుతోందన్నారు. ఈ క్రమంలో ద్రవరూపం (లిక్విడ్)లో రూ.600తో 500 మి.లీటర్ల 'నానో' డీఏపీ, రూ.225తో 500 మి.లీ. నానో యూరియాను ఇఫ్‌కో అందుబాటులో తీసుకువచ్చిందన్నారు. ఈ ఎరువులు అన్ని రకాలుగా రైతులకు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. పంటకు పోషక నాణ్యత, ఉత్పాదకత పెంపొందించడంలో ద్రవరూపంలో ఉన్న నానో డీఏపీ, యూరియా చాలా ప్రభావంతంగా పనిచేస్తాయన్నారు. ఎలాంటి అపోహలు లేకుండా రైతుల్లో అవగాహన కల్పించి నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.

బెదిరింపు కాల్‌పై డీఎంహెచ్‌ఓ ఫిర్యాదు

- డాక్టర్ లక్ష్మీకాంతమ్మ వివాదంలో ఎలాంటి చర్యలుండరాదని హెచ్చరిక
- ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం క్రైం: నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ చేసి గర్భిణి మృతికి కారణమైన డాక్టర్ లక్ష్మీకాంతమ్మ వివాదం మరో మలుపు తిరిగింది. ఈ వివాదంలో తలదూర్చిన ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకుడు నేరుగా డీఎంహెచ్ఓకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని హెచ్చరికలు జారీ చేశాడు. దీనిపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి గురువారం మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రి నిర్వహణతో పాటు గర్భిణి మృతికి సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ పూర్తి చేసి, నివేదికను అందజేసినట్లు వివరించారు. ఈ నివేదిక ఆధారంగా డాక్టర్ లక్ష్మీకాంతమ్మ సస్పెన్షన్‌కు కలెక్టర్ సిఫారసు చేశారని గుర్తు చేశారు. అయితే ఎస్సీ, ఎస్టీ సంఘం పేరుతో ఈ నెల 24న ఓ వ్యక్తి తనకు ఫోన్ చేసి బెదిరించడం చాలా బాధించిందన్నారు. తప్పును తప్పుగానే చూడాలన్నారు.

వైద్య సంఘాల సంఘీభావం

బెదిరింపు కాల్‌పై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మనోరంజన్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ అభిషేక్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ నిరంజన్ రెడ్డి, డాక్టర్ ప్రసూన, సహాయ కార్యదర్శి డాక్టర్ వంశీకృష్ణ, విశ్రాంత డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామసుబ్బారావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ కళ్యాణ్‌కుమార్, డాక్టర్ అనుపమ జేమ్స్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీహర్ష తదితరులు స్పందించారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డాక్టర్ వీరబ్బాయిని కలసి తమ సంఘీభావం తెలిపారు. నిబంధనలు ఎవరు అతిక్రమించినా చర్యలు తీసుకుని తీరాల్సిందేనని, లేదంటే వైద్య వృత్తిపై ప్రజలు విశ్వాసం కోల్పోయే ప్రమాదముందన్నారు. అనంతరం బెదిరింపు కాల్ చేసిన ఆగంతకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమి క్యాంప్ కార్యాలయంలో కలసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

పోలీసులకు ఫిర్యాదు

బెదిరింపు కాల్ విషయమై డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి అనంతపురం రెండో పట్టణ పోలీసులకు గురువారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ట్రూ కాలర్‌లో ఆగంతకుని పేరు సాకే గంగాధర్ అని చూపుతోందన్నారు. అతని సెల్ నెంబర్‌ను ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట డీఐఓ డాక్టర్ యుగంధర్ ఉన్నారు.

సంప్‌లో పడి కార్మికుడి మృతి



మృతుడు ప్రసాద్

తాడిపత్రి: ప్రమాదవశాత్తు సంప్‌లో పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ప్రసాద్ (43) చుక్కలూరులోని పారిశ్రామిక వాడలో ఉన్న వెంకటేశ్వర స్లాబ్స్ పరిశ్రమలో ఉంటూ అక్కడే కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం నుంచి ప్రసాద్ కనిపించకపోవడంతో యజమాని కృష్ణారెడ్డి ఆరా తీశాడు. దీంతో కార్మికులు గాలింపు చేపట్టారు. పరిశ్రమలోని నీటి సంపు వద్ద ప్రసాద్ చెప్పులు కనిపించడంతో అనుమానం వచ్చి సంప్‌లో పరిశీలించారు. ఓ ప్లాస్టిక్ బిందె నీటిపై తేలియాడుతుండడంతో అనుమానం వచ్చి సంప్‌లో దిగి పరిశీలించగా ప్రసాద్ మృతదేహం కనిపించింది. బుధవారం రాత్రి సంప్‌లోని నీటిని తోడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అదుపు తప్పి అందులో పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

560 మార్కులు సాధించిన విద్యార్థులకు ఉచిత విద్య

రాప్తాడు రూరల్: పదో తరగతిలో 560, ఆపై మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్యతో పాటు వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు అనంతపురం నగరంలోని శ్రీవిజన్ జూనియర్ కళాశాల, శివశక్తి ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధులు ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 540 పైబడి మార్కులు సాధించిన 30 మంది విద్యార్థులకు ఇంటర్‌తో పాటు ఎంసెట్, జేఈఈ, నీట్ కోర్సులకు ఉచిత శిక్షణ ఉంటుంది. 450 మార్కులు సాధించిన 30 మంది విద్యార్థులకు కేవలం హాస్టల్ ఫీజుతోనే ఇంటర్ చదివిస్తారు. పూర్తి వివరాలకు 98661 17303, 99088 29351, 62811 58454లో సంప్రదించవచ్చు.

27న జిల్లాస్థాయి యువ ఉత్సవం

అనంతపురం కల్చరల్: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 27న యువ ఉత్సవం నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర డీడీఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఎస్‌వైకే సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో వివరాలను ఆయన విలేకరులకు తెలియజేశారు. స్థానిక సాయి బాబా కళాశాల వేదికగా జరిగే యువ ఉత్సవాన్ని ఎంపీ తలారి రంగయ్య, నెహ్రూ యువ కేంద్ర దక్షిణ రాష్ట్రాల రీజినల్ డైరెక్టర్ నటరాజ్ ప్రారంభిస్తారని చెప్పారు. యువతలోని ప్రతిభ వెలికి తీసేలా వక్తృత్వ, పద్య, చిత్రలేఖం, సాంస్కృతిక, మొబైల్, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన వారి నగదు బహుమతి అందజేస్తామన్నారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

పెనుకొండ: సోమందేపల్లి మండలం రంగేపల్లి వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి పనులు కొనసాగుతుండడంతో బెంగళూరు - గుంతకల్లు మార్గంలో పలు రైళ్ల రాకపోకలు ఆలస్యమయ్యాయి. విషయం తెలియక ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ పరిస్థితి మరికొన్ని రోజులు ఉంటుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

28న సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

- జిల్లాలోని 8 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- హాజరుకానున్న 3,213 మంది అభ్యర్థులు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 85002 92992

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 28న అనంతపురంలోని 8 కేంద్రాల్లో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ-2023 పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ గౌతమి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పరీక్షకు 3,213 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈ క్రమంలో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ పనిచేసేలా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ఏదేని సమాచారం లేదా ఫిర్యాదు కోసం కంట్రోల్ రూమ్ (85002 92992)కు ఫోన్ చేయవచ్చు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఈ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుంది.

పరీక్ష కేంద్రాలు ఇవే...

- ఎస్‌వీ డిగ్రీ కళాశాల, జీసెస్‌నగర్
- జేఎన్‌టీయూ(ఏ) కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, శారదనగర్ (సబ్‌సెంటర్- ఎ)
- జేఎన్‌టీయూ(ఏ) కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, శారదనగర్ (సబ్‌సెంటర్- బి)
- కేఎస్ఎన్ ప్రభుత్వ యూజీ, పీజీ మహిళా కళాశాల, ఆర్టీఓ ఆఫీస్ పక్కన, భైరవ్‌నగర్
- ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, జిల్లా పరిషత్ కార్యాలయం దగ్గర
- ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, టవర్‌క్లాక్ దగ్గర
- శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

టీచర్ల సందేహాల నివృత్తికి కమాండ్ కంట్రోల్ రూం

రాప్తాడు రూరల్: టీచర్ల బదిలీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ గురువారం వెల్లడించారు. కమాండ్ కంట్రోల్ రూం అధికారులుగా పి.జయచంద్ర (94402 40045), జి.శ్రీనాథ్ (94408 74184), బి.ఆదినారాయణ (94948 36875), పి.మస్తాన్ (83280 57301), పి.ప్రదీప్‌కుమార్ (99481 21966), కె.పార్థసారథి (94948 36893)లను నియమించారు. ఉపాధ్యాయులకు ఏదైనా సందేహం తలెత్తితే వారి నంబర్లకు ఫోన్లు చేసి నివృత్తి చేసుకోవచ్చని డీఈఓ తెలిపారు. ఒకే పాఠశాలలో 5 విద్యా సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన ప్రధానోపాధ్యాయులు, 8 ఏళ్ల సర్వీస్ పూర్తయిన టీచర్లు తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే రీ-అపోర్షన్‌మెంట్ మేరకు సర్‌ప్లస్ అయిన టీచర్లు, సబ్జెక్టు కన్వర్షన్ అయిన స్కూల్ అసిస్టెంట్లు కూడా తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోతే సంబంధిత పాఠశాల హెచ్ఎం, అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

టీడీపీ నాయకుడి బరితెగింపు



టీడీపీ నాయకుడు రఫీక్ ఏర్పాటు చేసిన హోటల్

రాయదుర్గం: బొమ్మనహాళ్ మండలం దర్గా హొన్నూరులో టీడీపీ నేత రఫీక్ బరితెగించాడు. విలువైన గ్రామ కంఠం భూమిలో ఇల్లు నిర్మించుకోవడమే కాకుండా రోడ్డును ఆక్రమిస్తూ ఓ హోటల్ ఏర్పాటు చేశాడు. దీంతో బస్సుల రాకపోకలకు, జన సంచారానికి ఇబ్బందులు ఎదురవుతుండడంతో విషయాన్ని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ఎవరికీ ఇబ్బంది లేకుండా దుకాణాలను వెనక్కు జరిపించాలని అధికారులకు సూచించారు. దీంతో గురువారం ఉదయం రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించి జారీ చేసిన నోటీసును అందుకునేందుకు రఫీక్ నిరాకరించాడు. ప్రభుత్వ కార్యక్రమానికి సహకరించకపోవడం వల్లనే తనపై కక్ష కట్టారంటూ సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాడు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ బోగన్నగౌడ్ మాట్లాడుతూ.. గ్రామ కంఠం భూములు ఆక్రమణకు గురైన మాట వాస్తవమేనన్నారు. దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

క్లుప్తంగా

నాడు - నేడు పనులు పూర్తి చేయాలి
- అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్


నాడు- నేడు పనులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

ఆత్మకూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ తెలియజేశారు. గురువారం ఆత్మకూరు ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని, పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు పనులు పూర్తి చేయాలని సూచించారు. పనులు నాణ్యతగా ఉండాలన్నారు. ఎంఈఓ నరసింహారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్ నాయక్, దీప్తి, పాల్గొన్నారు.

చేతిపంపు ఏర్పాటు


నూతనంగా ఏర్పాటు చేసిన చేతిపంపు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జకాత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోరు వేయించి, చేతిపంపు ఏర్పాటు చేశారు. ఎస్సీ కాలనీలో నీటి సమస్య అధికంగా ఉండడంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సూచనలతో సర్పంచు వరలక్ష్మి జకాత్ ఫౌండేషన్ అమెరికా దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సంస్థ కోఆర్డినేటర్ నూర్ మహమ్మద్ సహకారంతో బోరు వేయించి, చేతిపంపు ఏర్పాటు చేశారు.

బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌గా కె.లక్ష్మీనారాయణ


అనంతపురం టవర్‌క్లాక్: బహుజన సమాజ్‌పార్టీ అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్‌గా కొత్తూరు లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జిల్లాబాడీ సమావేశం నిర్వహించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దెల నాగభూషణం అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతంకుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి ఆదేశాల మేరకు జిల్లా ఇన్‌చార్జ్‌గా లక్ష్మీనారాయణను నియమించినట్లు తెలిపారు. జూన్ 19న మదనపల్లిలో రాజ్యాధికార సభ జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తిరుమలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు


మొలక శాతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

రాప్తాడు: ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో అందించే విత్తన వేరుశనగ నాణ్యతలో రాజీ పడొద్దని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. గురువారం వారు రాప్తాడులో రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. సబ్సిడీ విత్తనాల నాణ్యత ప్రమాణాన్ని, విత్తనం మొలకశాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, నాయకులు వరిమడుగు తిరుపాలరెడ్డి, గవ్వల నల్లప్ప, చిన్నకృష్ణారెడ్డి, వీఏఏ శ్రీనివాసులు, వీహెచ్ఏ సోనియా, రైతులు పాల్గొన్నారు.

న్యూ ఫ్రాంక్స్ కారు విడుదల


కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: నగరంలో గుత్తిరోడ్డులోని దుర్గా మారుతీ, నెక్సా షోరూంలో గురువారం ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో మారుతీ న్యూ ఫ్రాంక్స్ వెహికల్‌ను మార్కెట్లోకి విడుదల చేశారు. షోరూం నిర్వాహకులు ఎస్‌వీ రావు, సీఈఓ రాజేష్, మేనేజింగ్ డైరెక్టర్ మహేష్ హాజరయ్యారు. కొత్త ఫీచర్స్‌తో కారు మార్కెట్‌లోకి వచ్చిందని వారు తెలిపారు.

నాణ్యత లేకపోతే వెనక్కే

ఆత్మకూరు: సబ్సిడీ వేరుశనగ కాయలు నాణ్యతగా లేకపోతే వెనక్కి పంపుతామని ఏఈఓ సుజిత తెలియచేశారు. గురువారం వడ్డుపల్లి పంచాయతీలో వేరుశనగ లోడు రావడంతో రైతులతో కలిసి పరిశీలించారు. రెండు లోడ్లు నాణ్యతగా లేనందున్న వాటిని వెనక్కి పంపామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఓబిరెడ్డి, శివారెడ్డి, ఎంపీఈఓ భారతి, రైతులు పాల్గొన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

అనంతపురం: ఎస్కేయూ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్‌పై వెళ్తున్న వాహనాన్ని వెనుక వైపు నుంచి వేగంగా ఆటో ఢీ కొనింది. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం పెద్ద కమ్మవారిపల్లికి చెందిన లెక్కల పోతన్న (62)కు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణాలతో 'సెల్' గాటం


సారూ.. మీరే ఇలా అయితే ఎలా?

నగరంలో రహదారుల విస్తరణలో భాగంగా ఆధునిక హంగులు అద్దారు.. అందుకనుగుణంగా సాంకేతికత తోడైంది.. జేబులో ఉండాల్సిన మొబైల్.. చేతిలోకొచ్చింది.. ఇంకేముంది.. వాహనదారులు నిబంధనలకు బంధనాలు వేసి.. అందమైన రహదారులపై హల్'సెల్' చేస్తున్నారు.. ఓ వైపు ప్రతి కూడలిలోనూ ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నాయి.. పోలీసుల నిబంధనలు ప్రతిచోటా హెచ్చరిస్తున్నాయి.. అయితేనేం.. ఫోన్లో మాట్లాడుతూ ప్రాణాలతో 'సెల్' గాటమాడుతున్నారు. అజాగ్రత్తే అపాయమని పోలీసులు పేరుపేరునా, ప్రతి వాహనదారుడికీ అవగాహన కల్పించలేరు.. కన్నవారికి కడుపుకోత మిగులుతుందని ఎవరికివాళ్లు తెలుసుకోవాలి.. జాగ్రత్తలు పాటించి, వాహనాలు నడపాలి.. అప్పుడే సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకోవచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


సింగిల్ హ్యాండ్ డ్రైవ్


ఎదురుగా వచ్చే వాహనాలు చూసుకోరా?


అన్నో.. ఒక చేత్తో డబుల్ డ్రైవ్ చేస్తున్నారా?


బ్రదరూ.. జర దారి చూసి డ్రైవ్ చేయరూ..



హజ్ యాత్రికులకు రేపు అవగాహన

అనంతపురం సిటీ: హజ్ యాత్రికులకు అనంతపురం పోలీస్ కాంప్లెక్స్ కన్వెన్షన్ హాలులో శనివారం అవగాహన సదస్సు ఉంటుందని హజ్ కమిటీ జిల్లా కన్వీనర్ ముస్తాఖ్ మౌలానా బాఖవి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి వారు సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

27న హజ్ యాత్రికులకు టీకా

అనంతపురం క్రైం: నగరంలోని పోలీసు వెల్ఫేర్ కాంప్లెక్స్‌లో హజ్ యాత్రికులకు ఈ నెల 27న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు మూడు రకాల టీకా వేస్తున్నట్లు డీఐఓ డాక్టర్ యుగంధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

బంగారు గొలుసు మాయం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని మొదటి రోడ్డుకు చెందిన సావిత్రి అనే మహిళ గురువారం కొత్త బంగారు గొలుసు కొనుగోలు చేసి, పాతూరు ఆంజనేయస్వామి ఆలయంలో పూజ చేయించింది. పూజారి ఆమెకు గొలుసు ఇవ్వగానే బ్యాగులో ఉంచుకొని ఇంటికెళ్లింది. ఇంటికెళ్లి చూడగా గొలుసు కనిపించలేదు. బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. గురువారం ఉపాధి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ధర్నాకు సుబ్బరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సూరి, నాయకులు పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌బాబు, లక్ష్మీనారాయణ, వెంకటచౌదరి, చంద్రమోహన్, ఓబుళేసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వెంకట శివారెడ్డి

రాప్తాడు: ద్విచక్ర వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని కందుకూరు క్రాస్‌లో ద్విచక్ర వాహనాదారులకు రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పీడీఎల్ రుద్రయ్య

రాప్తాడు: చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని ఎస్‌పీడీఎల్ రుద్రయ్య పేర్కొన్నారు. మండలంలోని ఎం.చెర్లోపల్లిలో ఏఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో ఖరీఫ్ మిశ్రమ ఆహార పంటలు, చిరుధాన్యాల పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సభ్యులతో చిరుధాన్యాలతో చేయించిన పంటలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ వీరభద్ర రెడ్డి, జెడ్‌బీఎన్ఎఫ్ కోఆర్డినేటర్ ఎర్రిస్వామి రెడ్డి, ఏఈఏ లోకేశ్వరి, ఎంపీహెచ్ఓ రాజు, ఎంటీఎల్ దస్తగిరి, సీఎన్ఎఫ్ క్లస్టర్ కోఆర్డినేటర్లు నరేంద్ర, ఉజ్వల, సీబీఓఏ రామకృష్ణ, ఎఫ్‌పీఓ సీఈఓ మంజు, ఎస్‌టీఓలు శిల్ప, వేణు, నాగభూషణ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


వాహనదారులతో మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం శ్రీ కంఠం సర్కిల్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి పరిశీలించారు. గురువారం సప్తగిరి సర్కిల్, రాజీవ్ గాంధీ సర్కిల్, సుభాష్ రోడ్డు, క్లాక్ టవర్, ఎన్టీఆర్ సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, పాతూరు, తాడిపత్రి బస్టాండు కూడళ్ల వద్ద వాహనదారుల రాకపోకలను డీఐజీ పరిశీలించారు. ఆయా కూడళ్లు, రహదారులపై వాహనదారులు, నడిచి వెళ్తున్న వారిని డీజీఐ పిలిచి మాట్లాడారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి పోలీసులతో సహకరించాలని తెలిపారు. ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రహదారులపై వాహనాలు నిలపడం, రాంగ్ రూట్, త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్‌పై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు సుబ్బారావు జీవితం ఆదర్శప్రాయం


అవార్డునందుకుంటున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్: కల్లూరు సుబ్బారావు జీవితం ఆదర్శప్రాయమని పలువురు వక్తలు అన్నారు. గురువారం రాత్రి స్థానిక లలితకళా పరిషత్తులో కల్లూరు సుబ్బారావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఎలేకపీ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లలితకళా పరిషత్తు కార్యదర్శి పద్మజ, సీనియర్ రంగస్థల నటులు సంగాల నారాయణస్వామి, సోమిరెడ్డి, ఉంగరాల శ్రీనివాసులు తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. సాహితీవేత్తలు టీఎస్ఏ కృష్ణమూర్తి,(మదనపల్లి)కల్లూరు రాఘవేంద్రరావు (హిందూపురం), ఆర్వీ ప్రసాద్ (అనంతపురం) కల్లూరు సుబ్బారావు స్మారక అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో రంగస్థల నటులు ఆదినారాయణరెడ్డి, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకరబాబు, రెడ్డి జనసంఘ్ శ్రీనివాసరెడ్డి, సీనియర్ రచయితలు రమేష్ నారాయణ, రియాజ్, నబీరసూల్, అస్లాం, లోకేష్ పాల్గొన్నారు.

వలంటీర్లు జగనన్న సైన్యం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: వలంటీర్లు జగనన్న సైన్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న సీఎం వైఎస్ జగన్ సంకల్పానికనుగుణంగా వలంటీర్లు సేవలందిస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ ఆర్డీ కార్యాలయంలోని సమావేశపు గదిలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. 41 నుంచి 57 సచివాలయ పరిధిలోని 250 మంది వలంటీర్లను ఎమ్మెల్యే అనంత సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ స్ఫూర్తితో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని భావించి, పింఛన్లు, రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలు తీసుకొచ్చారన్నారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేశానని చెప్పుకునే చంద్రబాబునాయుడు హయాంలో ఏ ఒక్క పథకం పేదలకు అందించలేదన్నారు. జన్మభూమి కమిటీ సిఫార్సులున్న వారికే అందించారన్నారు. పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి టీడీపీ అరాచకపాలన, సంక్షేమంలో జరుగుతున్న అన్యాయంపై ప్రజలు వివరించారన్నారు. గత నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 2.10 లక్షలు (రెండు లక్షల పదివేల కోట్లు) లబ్ధిదారులకు అందజేయడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషించారన్నారు. సూర్యోదయం కాకముందే పింఛన్లు అందిస్తున్నారన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న వలంటీర్ వ్యవస్థను సైంధవుల్లా ప్రతిపక్షాలు అడ్డుకునే ప్రయత్నం చేసి, కోర్టుకు వెళ్లిన సందర్భాలున్నాయన్నారు.

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి..

ప్రతిపక్షాలను దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు వలంటీర్లు సిద్ధమయ్యారని ఎమ్మెల్యే అనంత అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేసిన మేలును తెలియజేయాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ కోవిడ్ విపత్కర పరిస్థితిలో వలంటీర్లు మందులు, నిత్యావసర సరుకులు అందించి ప్రజల ప్రాణాలను కాపాడారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్లు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, చింతకుంట మధు, కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, కమల్‌భూషణ్, మీనాక్షి, రమాదేవి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం: నగరపాలక సంస్థ అదనపు సమావేశ భవనంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఉంటుందని కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. 58 నుంచి 72, 74వ సచివాలయ పరిధిలోని 221 మంది వలంటీర్లకు సన్మానం ఉంటుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కలెక్టర్ గౌతమికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: జిల్లాలో గిరిజన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఎమ్.గౌతమిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. ఉద్యోగపరంగా ఆర్ఓఆర్ (రూల్స్ ఆఫ్ రిజర్వేషన్) అమలయ్యేలా చూడాలన్నారు. గిరిజనుల భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమాధికారి అన్నాదొర, గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు నాయక్, జీపీఎస్ నాయకులు నాగరాజునాయక్, హనుమంతునాయక్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు నేరం


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ ధనలక్ష్మి

రాప్తాడు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహనసదస్సు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ పేదరికం, ఇతర ఇబ్బందులతో తల్లిదండ్రులు ఆడ పిల్లలను భారంగా చూడొద్దన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు, ఎంపీడీఓ సాల్మన్, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ, ఎస్ఐ ఆంజనేయులు, వైద్యాధికారి శ్రావణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న, ఏపీఎం శివకుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పిడిబాకుతో దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కారు పార్కింగ్ విషయంగా ఘర్షణ పడి పిడిబాకుతో దాడి చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతపురం మూడో పట్టణ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన మేరకు... హైదర్‌వలి కాలనీలో నివాసం ఉంటున్న మసూద్, జహీర్ కారు పార్కింగ్ విషయంలో గొడవ పడ్డారు. స్థానికులు సర్దిచెప్పినా వినిపించుకోలేదు. ఇంతలో మసూద్ పిడిబాకుతో జహీర్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన జహీర్‌ని స్థానికులు స్పందించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

తెలంగాణ ఎంసెట్‌లో సత్తా

రాప్తాడురూరల్: తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. గురువారం విడుదలైన ఎంసెట్ ఫలితాల్లో ధనకొండ చైతన్య 468వ ర్యాంకు, షేక్ జహ్వారా 1,808 ర్యాంకు, గుర్రం పవన్ కార్తికేయ 3,044, షేక్ ఖాజి రిజా ముఖద్దామ్ 4,601 ర్యాంకు సాధించారు. ప్రిన్సిపాళ్లు ఆంజనేయులు, దుర్గేష్, రవికుమార్, కిశోర్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

అనంతపురం క్రైం: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థలో ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులపై కమిషనర్ ప్రస్తావించారు. సకాలంలో బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని, అభివృద్ధి పనులను ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. బిల్లుల కోసం ఇంజినీర్లు, సిబ్బంది కమీషన్ల కోసం ఇబ్బంది పెడుతున్నారా? అని కమిషనర్ ప్రశ్నించారు. ఎస్ఈ సతీష్‌చంద్ర, డీఈ రాంప్రసాద్ రెడ్డి, ఏఈ శంకర్ పాల్గొన్నారు.

ఉల్లిగడ్డల వ్యాపారి ఆత్మహత్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్/గార్లదిన్నె: వారం రోజుల క్రితం అదృశ్యమైన ఉల్లిగడ్డల వ్యాపారి శంకరయ్య గార్లదిన్నె పోలీసు స్టేషన్ పరిధిలో ఆత్మహత్య చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. యాడికి మండలం, గుడిపాడుకు చెందిన బాల శంకరయ్య (48) అనంతపురంలోని ఆర్‌కే నగర్‌లో నివాసముంటున్నాడు. అప్పు అధికమై, తీర్చేమార్గంలేక ఈ నెల 19న గార్లదిన్నెకు వెళ్తున్నట్లు ఇంట్లో తెలిపి, వెళ్లిపోయాడు. ఆతర్వాత ఇంటికి చేరుకోలేదు. భార్య సుభద్రమ్మ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం గార్లదిన్నె మండలం తిమ్మంపేట చెరువు సమీపంలో కుళ్లిన స్థితిలో ఓ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి జేబులో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా శంకరయ్య కుటుంబసభ్యులకు ఎస్ఐ సాగర్ సమాధానమిచ్చారు. కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని మృతుడిని శంకరయ్యగా ధ్రువీకరించారు.

కౌలురైతులకు గుర్తింపుకార్డులివ్వాలి

అనంతపురం అర్బన్: కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఆర్ఓ గాయత్రి దేవికి ఏపీ రైతు సంఘం (సీపీఐ) నాయకులు విన్నవించారు. గురువారం డీఆర్ఓను కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్ వద్ద సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నప్పయాదవ్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం సమస్య వివరించారు. నాయకులు నాగేశ్, గోపాల్, శేఖర్, కుళ్లాయప్ప, చంద్రశేఖర్, లలితమ్మ పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ఆత్మకూరు: పి.యాలేరుకు చెందిన హరిజన ఎగువింటి శీనప్ప (53) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. బంధువులు తెలిపిన మేరకు.. శీనప్ప వ్యవసాయం కోసం అప్పు చేసి, తీర్చే మార్గంలేక మదనపడుతుండేవాడు. గురువారం ఛాతీలో నొప్పి వచ్చి ఉన్నపళంగా కుప్పకూలాడు. భార్య కుంటెమ్మ గుర్తించి, 108 వాహనానికి సమాచారం అందించింది. 108 సిబ్బంది వచ్చి చూడగా, అప్పటికే అతను మృతిచెంది ఉన్నాడు.

అసాంఘిక కార్యకలాపాలపై ఫిర్యాదు చేయండి

రాప్తాడురూరల్: శివారు కాలనీల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే తాట తీస్తామని రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ విజయభాస్కర్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం కక్కలపల్లి పంచాయతీ బీజేపీ కాలనీలో సీఐ పర్యటించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఎస్ఐ వెంకటరమణ, ఏఎస్ఐలు శ్రీనివాసులు, నగేష్ ఉన్నారు.

తిరుప్పాడ సేవలో భాగస్వాములు కావాలి

అనంతపురం కల్చరల్: శ్రీగోవింద వాసవీ భజన మండలి ఆధ్వర్యంలో జూన్ 11న జరగనున్న తిరుప్పాడ సేవలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు ఆళ్లగడ్డ రాము కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక శ్రీనివాసనగర్‌లోని రామాలయంలో తిరుప్పాడ సేవ పోస్టర్లు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ శ్రీవారికి ఇష్టమైన వెయ్యి లడ్డూలు, ఓళిగలతో అభిషేక నైవేద్యం చేసి, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేస్తామన్నారు. జిల్లా కార్యక్రమంలో భజన మండలి సభ్యులు రమణ, రఘు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పచ్చ పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవం

రాప్తాడు: అయ్యవారిపల్లిలో రస్తా సమస్యపై పచ్చపత్రికల్లో గురువారం వెలువడిన కథనాలు అవాస్తమని గ్రామస్తులు శివశంకర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, చిన్న శంకర్‌రెడ్డి, పుల్లా రెడ్డి, లక్ష్మీరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అయ్యవారిపల్లి సర్వే నంబర్ 420–2లో 6.56 ఎకరాల భూమి ఉందన్నారు. ప్రజా ప్రయోజార్థం కోసం వదిలిన ప్రభుత్వ స్థలంలో గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. మా పొలంలోకి గ్రామానికి చెందిన వడ్డే రఘుపతి ఇరవై అడుగులు, సోముశేఖర్ రెడ్డి ఏడున్నర అడుగులు, డబ్బాల నాగప్ప, ఏడున్నర అడుగులు, కిష్టప్ప, భాస్కర్‌లు ఏడున్నర అడుగులు కబ్జా చేశారన్నారు. ఆర్డీఓకు స్పందనలో, తహసీల్దార్, ఎస్ఐకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఆరునెలల క్రితమే సర్వే చేయించామన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారు కొందరిని రెచ్చగొట్టి బండలుపాతించి, ఘర్షణకు దిగుతున్నారన్నారు. అలజడులు సృష్టించేందుకు సీపీఎం నాయకులు, కక్షలు పెట్టేందుకు టీడీపీ నాయకులు వెనుకుండి నడిపిస్తున్నారన్నారు. పచ్చ పత్రికలు అవాస్తమైన కథనాలు ప్రచురించినట్లు తెలిపారు.

ఉద్యోగి సస్పెన్షన్

అనంతపురం: ఎస్కేయూలోని పరీక్షల విభాగంలో పని చేస్తున్న మినిమం స్కేలు ఉద్యోగి లక్ష్మిరెడ్డిని గురువారం సస్పెండ్ చేశారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ఉత్తర్వులు జారీచేశారు. విధిధుల్లో నిద్రపోవడం, తరచూ సెల్‌ఫోన్ చూస్తూ విధులపై నిర్లక్ష్యం వహిస్తుండడంతో సెల్‌ఫోన్ లో వీడియో తీసి వీసీ వాట్సాప్ నంబర్‌కు పంపడంతో వీసీ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.